క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రూ.125 కోట్లతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడవద్దన్నారు. ప్రత్యేక శ్రద్ధతో, పూర్తి నాణ్యతతో పనులు చేయాలన్నారు. పూర్తి చేసిన పనుల బిల్లులను సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రాబోయే వర్షాకాలంలో నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. మోటార్లకు అవసరమైన రిపేర్లు చేయించి సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఏఈలు శేషగిరిరావు, కనకారావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కడియం: మండలంలోని వీరవరంలో దివంగత ఇనుమర్తి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రభాత్, సతీష్ శుక్రవారం మజ్జిగ, పుచ్చకాయ జ్యూస్‌ను సుమారు రెండువేల మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగడ జెమి ఆదిమూలం సాయిబాబా, ముద్రగడ సుధా, గంధం వీరబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా అభివృద్ధి పనులు



స్థానికులతో మాట్లాడుతున్న కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని సింహాచల నగర్ ప్రాంతంలో ఎంపీ భరత్‌రామ్ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, 49వ డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు అన్నారు. ఆ పనులను శుక్రవారం స్థానికులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల వల్ల కాలువల నిర్మాణం ఇబ్బందికరంగా తయారవుతుందని, స్థానికులు గుర్తించి మసలు కోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఎంపీ భరత్‌రామ్ పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

సీతానగరం: అర్హులందరికీ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్థలాలు కేటాయించడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. మండలంలోని ముగ్గళ్ల – కోరుకొండ రోడ్డులో గల కూనవరం సుద్దమెట్టను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సీతానగరం, కూనవరం, రఘుదేవపురం గ్రామాలకు చెందిన 1,600 మందికి ఎన్‌పీఐ కింద ఇళ్ల స్థలాలు అందించడానికి సుద్దమెట్ట వద్ద కేటాయించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఇక్కడ కొంత ప్రాంతాన్ని ఇళ్ల స్థలాలకు అనుగుణంగా సరిచేయడం జరిగిందన్నారు. మిగిలిన కొండను ఆనుకుని పక్కనే ఇళ్ల స్థలాలు అందించడానికి రెండు ఎకరాలు భూమి కొనుగోలు చేయడమా లేదా ఈ కొండ వద్ద స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవడమా అనేది కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: అన్నీ మంచిశకునాలే
సూర్యమినీ	: మెన్‌టూ
సూర్యప్యాలెస్	: నేను ఫేమస్
స్వామి	: బిచ్చగాడు-2
శివజ్యోతి	: కస్టడీ
అనుశ్రీ	: విరూపాక్ష
రాజా	: బిచ్చగాడు-2
అశోక	: మళ్లీపెళ్లి
ఊర్వశి	: ఏలియన్స్2042
రంభ	: ది కేరళస్టోరీ
మేనక	: రామబాణం, ఉగ్రం
అప్సర	: 2018
నామవరం	
వీఎస్ మహల్	: 2018
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: 2018
కడియం	
వెంకటసూర్య	: బిచ్చగాడు-2

యుగపురుషుడు.. నిత్య స్మరణీయుడు

- సాంఘిక దురాచారాలపై సాహిత్య కత్తి దూసిన కందుకూరి
- నేడు ఆ మహనీయుని వర్ధంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కందుకూరి వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. 1919 మే 27న ఆయన మరణించేంత వరకూ సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి, స్త్రీ విద్యకు, వితంతువు వివాహాలు పునరుద్ధరణకు పాటుపడ్డారు. ఆయన స్త్రీవిద్యకు ఉద్యమించిన జ్ఞాన ప్రదాత. బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన స్ఫూర్తి ప్రదాత. వితంతులకు పునర్వివాహాలు జరిపించిన యుగపురుషుడు. సమాజ సేవ కోసం హితకారిణిని స్థాపించిన సేవామూర్తి.

రాజమహేంద్రవరం కేంద్రంగా..

రాజమహేంద్రవరం కేంద్రంగా యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం రచించిన తొలి ప్రదర్శిత నాటకం వ్యవహార ధర్మబోధిని నాడు సంచలనం రేపింది. సామాజిక రుగ్మతలపై ఆయన సంధించిన మరో అస్త్రం బ్రాహ్మీ వివాహం ఛాందసవాదులు కలవరపడేటట్లు చేయగలిగింది.

మొట్టమొదటి వితంతు వివాహం

1881 డిసెంబర్ 11న వీరేశలింగం తన ఇంటిలో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించారు. బాల వితంతు గౌరమ్మ, రేబూడికి చెందిన గోగుల పాటి శ్రీరాములుకు పెళ్లి చేశారు. వంట చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోతే భార్య రాజ్యలక్ష్మమ్మ తానే స్వయంగా వంట చేశారు.



కందుకూరి దంపతుల సమాధులు



కందుకూరి వీరేశలింగం రచించిన పుస్తకాలు

కందుకూరి రచనలు

మార్కండేయ మకుటంతో శతకం, శ్రీరాజమహేంద్ర పురవరగోపాల వంటి పద్య కావ్యాలు, వ్యవహార ధర్మబోధిని, చమత్కార రత్నావళి, అభిజ్ఞాన శకుంతలం వంటి నాటకాలు, రాజశేఖర చరిత్రము, సత్యరాజా పూర్వదేశ యాత్రలు వంటి రచనలు, సాంఘిక దురాచారాలపై అనేక ప్రసహనాలు రచించారు.

ప్రభుత్వంలో విలీనం

కందుకూరి స్థాపించిన విద్యాసంస్థలు ఒడిదుడుకులకు లోనవుతుంటే ఆయన రాసిన వీలునామా ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కందుకూరి విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేశారు. వీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, వీటీ తెలుగు మీడియం హైస్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌కే మహిళా కళాశాలలను ప్రభుత్వంలో విలీనం చేయడంతో కందుకూరి ఆశయాలను పరిరక్షించే విధంగా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు.

కందుకూరి అంతిమ సందేశాన్ని నెరవేర్చాలి



కందుకూరి వీరేశలింగం రాజమహేంద్రవరాన్ని విడిచిపెట్టినప్పుడు ఆయన మూడు కోర్కెలు కోరారు. వాటిలో మొదటిది నన్నయ పేరు మీదుగా రాజమహేంద్రిలో సర్వ సమగ్రమైన ఒక గ్రంథాలయ స్థాపన, రెండోది తెలుగు కవుల చరిత్ర పూర్తి పరిశోధనతో ముద్రణ పూర్తి చేయడం. మూడోది వ్యవహారిక తెలుగు భాషకు సమగ్ర వ్యాకరణం రూపొందించడం. పైమూడు పనులు అలాగే మిగిలిపోవడం ఆంధ్రుల అలసత్వానికి చిహ్న పతాక.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కందుకూరి జీవితం–సాహిత్యంపై పరిశోధకుడు

మహిళా యూనివర్సిటీకి కృషి



సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన హితకారిణి సమాజం పరిధిలోని మహిళా విద్యాసంస్థలను కలిపి శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళా యూనివర్సిటీగా చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. అందుకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

– కాశి బాల మునికుమారి, హితకారిణి సమాజం చైర్మన్

అభివృద్ధి పనుల ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన వాటర్‌ట్యాంకును పరిశీలించి, అనంతరం ప్రజలు సమస్యలను చందన అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు ముద్దాల అను, మండల సచివాలయ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మి, మేడపాటి సద్గుణ రామారెడ్డి, మత్సేటి శివ, సోమన శ్రీను, తోడేటి రాజా, రాహుల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోకాల పోటీలు

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో శుక్రవారం శతక పద్యాలు, భగవద్గీత శ్లోకాలు, పాటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గొందేశి పూర్ణచంద్రారెడ్డి ట్రస్టు సమకూర్చిన బహుమతులు అందజేశారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు భాస్కరరావు, పి.రామచంద్రరావు, కె.ప్రసాద్ తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

వాలీబాల్ క్రీడాకారులకు అభినందన



వాలీబాల్ క్రీడాకారులతో ఎంపీ భరత్ రామ్

ప్రకాశం నగర్: వాలీబాల్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లెడ్లైట్ వాలీబాల్ కోర్టులో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కుంచే యశ్వంత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ వాలీబాల్ శిక్షణ శిబిరం గురువారం రాత్రి ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఈనెల 28 నుంచి పశ్చిమ బంగాలో జరుగుతున్న 45వ సబ్ జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి వెళుతున్న క్రీడాకారులను అభినందించారు. జట్టు సభ్యులకు కిట్లు, జెర్సీలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా యువకుడికి గాయాలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో శుక్రవారం విద్యుత్ స్తంభాలపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా బీశెట్టి వీరబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అంబులెన్స్‌లో ప్రైవేటు హాస్పటల్‌కు తరలించగా, అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఈదురుగాలుల కారణంగా శ్రీరంగపట్నం ఎస్సీపేటలో చెట్ల కొమ్మలు విరిగి సమీపంలోని విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. ఆ కొమ్మలను శుక్రవారం తొలగిస్తుండగా ఒక స్తంభం విరిగిపోయింది. గురువారం వచ్చిన ఉరుముల కారణంగా శ్రీరంగపట్నానికి చెందిన పెంటకొట్టి సీతయ్య పొలంలో పశువులను కాస్తూ అస్వస్థతకు గురయ్యాడు. చేనుగట్టుపై పడిపోయిన అతడిని బంధువులు చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. ప్రస్తుతం సీతయ్య పరిస్థితి మెరుగుపడింది. వీరిద్దరినీ శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, పార్టీ నాయకులు మద్దాల రమణ పరామర్శించారు. చికిత్స నిమిత్తం సహాయాన్ని అందిస్తామన్నారు.

మరింత బాధ్యతగా సేవలందించాలి

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. పిడింగొయ్యి, హుకుంపేట గ్రామ సచివాలయాలకు చెందిన వలంటీర్లకు శుక్రవారం స్థానిక గోల్డెన్ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్లో పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు అందజేయడంలో వలంటీర్లదే ప్రధానపాత్ర అన్నారు.

వలంటీర్లకు సత్కారం

పిడింగొయ్యి, హుకుంపేట సచివాలయాల్లో సేవారత్నలు సాధించిన తీగల పద్మ, మేడిశెట్టి సత్యగౌరి, కుమ్మర విజయలక్ష్మిని చందన నాగేశ్వర్ శాలువాతో సత్కరించారు. మిగిలిన వారిని సేవామిత్ర పురస్కారాలతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, జి.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు చీరారాజు, పసలపూడి శ్రీనివాసరావు, పడాల వీరరాఘవరెడ్డి, సుందరపల్లి అనిల్, పిల్లా లక్ష్మణరావు, మద్దిల రమణ, చిర్రా గణేష్, వేముల ఏసుబాబు, పంచికట్ల నాగేశ్వరరావు, అత్తిలి శ్రీనివాస్, బీదంరాజు, షేక్ మీరా, ఇబ్రహీం, శంకర్ పాల్గొన్నారు.



పిడింగొయ్యి, హుకుంపేట వలంటీర్ల సత్కారంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

సేవా పురస్కారాలు

కడియం: మండలంలోని కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వలంటీర్లకు వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. కడియపుసావరం పూలవర్తక సంఘం కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల ముందుకు తీసుకువెళుతున్న వలంటీర్ల సేవలను అభినందించారు. కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లోని 38 మంది వలంటీర్లకు రూ.3,80,000ను వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు నరమామిడి గణేష్, మాజీ సర్పంచ్‌లు సాపిరెడ్డి సూరిబాబు, ముద్రగడ ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు రంపం గోపాలకృష్ణ, బుడ్డిగ వీరవెంకట్రావు గౌడ్, పార్టీ నాయకులు సాపిరెడ్డి కామేష్, ధర్మాసనం వీరభద్రరావు, ప్రసాద్, భద్రం, రాంబాబు, అయినవిల్లి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శివాజీ, ఊటుకూరి శైలజ, దాసరి శ్రీను, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కడియపుసావరం వలంటీర్లను సత్కరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

క్యాన్సర్ నివారణకు అధునాతన చికిత్సలు

- సినీనటుడు విజయ్ ఆంటోనీ
- స్వతంత్ర ఆస్పత్రిలో మెమోగ్రఫీ యూనిట్ ప్రారంభం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్ నివారణకు ఎన్నో అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని సినీ హీరో, దర్శకుడు విజయ్ ఆంటోనీ అన్నారు. కంబాలచెరువు వద్ద ఉన్న జీఎస్ఎల్ స్వతంత్ర క్యాన్సర్ ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ రోగులకు ఉపయోగించే డిజిటల్ మెమోగ్రఫీ యూనిట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఆ రోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వ్యక్తిగతంగా సహాయం అందిస్తానని తెలిపారు. ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆటవస్తువులను అందించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయనకు ఆసుపత్రి చైర్మన్ గన్ని భాస్కరరావు వివిధ విభాగాలను చూపించి వాటి గురించి వివరించారు. డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ తరుణ్ చౌదరి మాట్లాడుతూ జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా 25 ఏళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హీరో విజయ్ ఆంటోనీ ఆయన సంస్థ ద్వారా పంపిన రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఏరుకొండ రఘురాం పాల్గొన్నారు.



జీఎస్ఎల్ క్యాన్సర్ ఆసుపత్రిలో డిజిటల్ మెమోగ్రఫీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న హీరో విజయ్ ఆంటోనీ



జీఎస్ఎల్ సిమ్యులేషన్ ల్యాబ్‌లో అనాటమేజ్ టేబుల్ గురించి హీరో విజయ్ ఆంటోనీకి వివరిస్తున్న వైద్యులు

మెడికల్ సిమ్యులేషన్‌పై సినిమా తీస్తా

రాజానగరం: మెడికల్ సిమ్యులేషన్ థీమ్‌తో ఒక సినిమా తీయాలనే ఆలోచన తనకు ఎంతో కాలంగా ఉందని, ఇక్కడ ఉన్న సిమ్యులేషన్ ల్యాబ్ చూశాక ఆ ఆలోచనకు ఒక స్పష్టత వచ్చిందని బిచ్చగాడు –2 హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయనకు అక్కడ ఉన్న సిమ్యులేషన్ ల్యాబ్ ప్రత్యేకతలను కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డైరెక్టర్ డాక్టర్ గోగినేని తరుణ్ వివరించారు. అవసరం అయితే ఈ ల్యాబ్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు మరోసారి వస్తానని విజయ్ ఆంటోనీ అన్నారు. వైద్య విద్యార్థులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. బిచ్చగాడు – 2లో పాటను స్వయంగా పాటడంతో పాటు విద్యార్థులతో కూడా పాడించారు. అనంతరం రాజమహేంద్రవరం వెళ్లారు. ఆయన వెంట డిస్ట్రిబ్యూటర్ మున్నా ఉన్నారు.

చిన్నారి వైద్యానికి సీఎం జగన్ సాయం

ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా రూ.లక్ష అందజేత

మధురపూడి: చిన్నారి వైద్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.లక్ష అందజేశారు. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వల్లూరి రెజినా ఇవాంజిలియన్ అనే 8 ఏళ్ల పాప 2018 నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. ఆ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి ఈ సమస్య వచ్చింది. ఆ పాప తల్లి బుజ్జమ్మ అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తూ, కుమార్తె వైద్యం కోసం రూ.45 లక్షలు ఖర్చు చేసింది. ఇంకా మందుల కోసం రూ.వేలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే రాజాను కోరారు. అలాగే కొవ్వూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే రాజా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన సీఎం జగన్ ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. దానిలో భాగంగా తక్షణ సహాయంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును జక్కంపూడి రాజా శుక్రవారం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.20 లక్షలు విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు.



రెజినా కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంపత్‌నగరంలో గడపగడపకూ..

రాజానగరం: నియోజకవర్గంలో గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా గడిచిన నాలుగేళ్లలో 30 రెట్లు అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందుకు మండలంలోని సంపత్‌నగరమే ఉదాహరణ అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో రూ.17.5 లక్షలతో అభివృద్ధి జరిగితే, తమ ప్రభుత్వంలో గడిచిన నాలుగేళ్లలోనే రూ.5.50 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, నాడు -నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల అభివృద్ధి, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, ఇలా అనేకం అభివృద్ధి పనులు జరిగాయన్నారు.



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అర్హతే ప్రామాణికం

జక్కంపూడి రాజా మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రభుత్వం నుంచి సాయం పొందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, లేకుంటే పచ్చచొక్కా వేసుకోవాల్సి వచ్చేదన్నారు. కానీ నేడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అటువంటి పార్టీల రంగులు చూడకుండా, ఎవరి దయాదాక్షిణ్యాలతో పనిలేకుండా, అర్హత ఉంటే చాలు నేరుగా ఇంటికే వచ్చి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వాలకు, జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఏమిటో మీరే గ్రహించాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్ రాష్ట్రంలో ఒకేసారి 31.75 లక్షల మంది పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాజానగరం నియోజకవర్గంలోనే సుమారు 20 వేల మందికి ఇంటి స్థలాల ఇచ్చి, ఇళ్ల కట్టుకునే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నాని బాబు, సంపత్ నగరం, పుణ్యక్షేత్రం సర్పంచ్‌లు పెంటగట్ల రామకృష్ణ, ఎం. వెంకటేశ్వర్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక అమ్మిరాజు, నాయకులు లంక ఆదినారాయణ, లంక మాచరావు, పి.వెంకటేశ్వర్రావు, కోనే మురళి, మదిరెడ్డి వెంకన్న, పేపకాయల రాంబాబు పాల్గొన్నారు.

బెదిరింపులపై ఫిర్యాదు

కంబాలచెరువు: ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్న తనపై కొందరు వ్యక్తులు జనసేన పేరుతో సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నర్సిపల్లి హారిక శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డిని కలిసి ఆమె ఫిర్యాదును అందజేశారు. ఫేస్‌బుక్ నకిలీ ఖాతాలతో తనపై కొందరు అసభ్య పదజాలంతో మాట్లాడుతూ, తనతో పాటు తన కుమార్తెను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తన వ్యక్తిగత జీవితాన్ని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

గాలీవాన బీభత్సం

మధురపూడి: కోరుకొండ మండలంలో శుక్రవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. జోరుగా కురుసిన వర్షానికి వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. కాగా.. గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోటి గ్రామంలోని అడపా వెంకన్నబాబుకు చెందిన కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. పలుచోట్ల రోడ్లకు అడ్డంగా చెట్లు కూలిపోయాయి.